
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 22 జూలై 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 , కనిష్ఠం : 23.0

స్వాధీనంలో.. స్వాహా



- పేకాట స్థావరాలపై దాడుల్లో పోలీసుల చేతివాటం
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇటీవల పట్టుపడ్డ రూ.25 లక్షలు నగదు
- చూపించింది మాత్రం కేవలం రూ.2 లక్షల పైచిలుకే..
- డబ్బుతో పాటు బంగారు ఆభరణాలనూ లాక్కున్నారని ఆరోపణ
- ఈ విషయమై రాయలసీమకు చెందిన ఓ ఎమ్మెల్యే రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు?
- పేకాట ఆడుకునేందుకు.. ఓ అధికారికి వారానికి రూ.3 లక్షల ముడుపులు



గద్వాల ఆంధ్రజ్యోతి(ప్రతినిధి) జూలై 21: జోగుళాంబ గద్వాల జిల్లా పేకాట రాయుళ్లకు అడ్డాగా మారింది. ఇక్కడ గద్వాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమవాసులు పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. పోలీస్ అధికారుల అండదండలతోనే పేకాట ఆడటానికి రాయలసీమ నుంచి ఇక్కడికి వస్తున్నారని తెలుస్తోంది. అయితే.. పేకాట స్థావరాలపై దాడులు చేసినప్పుడు పట్టుబడిన నగదులో పోలీసులు కొంత మాత్రమే చూపించి, మిగతాది నొక్కేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

పట్టుకుంది కొండంత.. చూపింది గోరంత

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో జిల్లాకు చెందిన ఓ ప్రత్యేక పోలీస్ బృందం ఈ నెల 13న దాడులు నిర్వహించింది. 15 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2,11,860లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. వాస్తవంగా అక్కడ దొరికింది రూ.30 లక్షల పైచిలుకే అని సమాచారం. అంతేకాకుండా పేకాట రాయుళ్ల చేతులు, మెడలో ఉన్న బంగారు ఆభరణాలను కూడా తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలో ఉండవల్లికి సంబంధించిన పోలీస్ అధికారులు కాకుండా జిల్లా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం, అది కూడా ఒకే కమ్యూనిటీకి చెందిన బృందం ఇందులో కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. గతంలో కూడా ఇదే బృందం బెట్టింగ్‌లో పట్టుబడిన నలుగురి నుంచి రూ.10 లక్షల పైచిలుకు డబ్బులతో పాటు బంగారు ఆభరణాలు కూడా తీసుకున్నట్లు పోలీస్ వర్గాలలో కూడా గుసగుసలు మొదలయ్యాయి. ఈ విషయమై పేకాట రాయుళ్ల బంధువులు రాయలసీమకు చెందిన ఓ ప్రజాప్రతినిధికి చెప్పారని, దాంతో ఆయన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ ప్రత్యేక బృందంపై నిఘా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం. రాయలసీమకు చెందిన ప్రజాప్రతినిధి రాష్ట్ర ఉన్నతాధికారులకు పోలీసులపై ఫిర్యాదు చేశాడని గద్వాల జిల్లా పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోందని తెలుస్తోంది. పేకాట రాయుళ్ల నుంచి రూ.లక్షలు కొల్లగొట్టి.. అందులో కొంత నగదును మాత్రమే చూపించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ నగదులో ఏ అధికారి ఎంత వాటా ఉందో తెలియాల్సి ఉంది.



పోలీసులపై బురదజల్లే ప్రయత్నం

పేకాటరాయుళ్లపై ఇటీవల నిర్వహించిన దాడిలో కొందరిపై కేసులు నమోదు చేశాము. అక్కడ మేము ఊహించినదానికంటే తక్కువ అమౌంట్ దొరికింది. కొందరు పరుగెత్తుతూ తమ వద్ద ఉన్న నోట్ల కట్టలను పొలాల్లో పారేసుకుంటూ వెళ్లారు. దాంతో కేవలం రూ.రెండు లక్షల పైచిలుకే లభ్యమైంది. తమ పోలీస్ సిబ్బంది డబ్బులు, బంగారు అభరణాలను తీసుకున్నారని నిరూపిస్తే వారిని సస్పెండ్ చేస్తాం. గద్వాల జిల్లాను పేకాట రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తా.

\- శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ

ఆ అధికారికి ముడుపులు


జిల్లాలో పేకాట రాయుళ్లు గత కొంతకాలంగా విచ్చలవిడిగా పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. అందుకు పోలీస్ అధికారుల అండదండలు ఉండటమే కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా శాంతినగర్, ఉండవల్లి, గద్వాల పరిధిలో ఎక్కడైనా పేకాట ఆడుకునేందుకు ఓ అధికారికి రూ.మూడు లక్షలు ప్రతీ వారం చెల్లించాల్సిందేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఇస్తుండటంతో దర్జాగా పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తే వారిలో కొందరిపై నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఈ విషయంలో పోలీస్ అధికారులతో పాటు కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్లు సమాచారం.

రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల దాకా..

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ శాంతినగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో కర్నూల్ జిల్లాకు చెందిన పలువురు రోజూ పేకాట ఆడుతున్నట్లు సమాచారం. రూ.50 లక్షల నుంచి రూ.రెండు కోట్ల వరకు ఆట ఆడుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. అందులో కీలక పాత్ర పోషిస్తున్నది కర్నూల్‌కు చెందిన వ్యక్తి అని సమాచారం. ఇందులో పోలీస్ అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది.



మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం



గుడిపల్లి గట్టు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు(ఫైల్)

అదనపు రిజర్వాయర్లు నిర్మించేరా?

- 4.45 లక్షల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో చేపట్టిన ఎంజీఎల్ఐ
- అందుకోసం 45 టీఎంసీల నీళ్లు అవసరం
- కానీ 4.1 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసుకునే వెసులుబాటు
- స్టోరేజ్ కెపాసిటీ లేక రెండేళ్ల క్రితం కాల్వల కింద ఎండిన పంటలు
- అదనంగా 20 రిజర్వాయర్లను నిర్మించాలని గతంలో సర్వే
- 2025 నాటికి పథకం పూర్తి చేయాలని సీఎం ఆదేశాలతో ఆశలు

నాగర్‌కర్నూల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వరప్రదాయిని అయిన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై ఆశలు చిగురిస్తున్నాయి. 2025లోగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అదనపు రిజర్వాయర్ల నిర్మాణంపై కూడా ఆశలు చిగురిస్తున్నాయి.

కదలని దస్త్రం

మహమబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, వనపర్తి నియోజకవర్గాల్లో నాలుగు లక్షల 45 వేల ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. అయితే ఆదరాబాదరాగా పథకాన్ని ప్రారంభించగా, చివరి ఆయకట్టు వరకు నీరందించే వ్యూహాన్ని మాత్రం అమలు చేయలేదు. 45 టీఎంసీల నీళ్లు అవసరమైన ఈ ప్రాజెక్టులో ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లలో కేవలం 4.1 టీఎంసీ నీటిని మాత్రమే నిల్వ చేసుకునే వెసులుబాటు ఉన్నది. ఈ క్రమంలో కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతం నుంచి వరద జలాలు రానట్లయితే లిఫ్టింగ్ ప్రక్రియకు విఘాతం కలిగే పరిస్థితి ఉన్నది. గడిచిన రెండేళ్ల క్రితం స్టోరేజీ కెపాసిటీ లేక కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వల కింద పంటలు ఎండిపోయాయి. ఈ సందర్భంలోనే దాదాపు 2 కోట్ల రూపాయల వరకు వెచ్చించి కేఎల్ఐలోని 28, 29, 30 ప్యాకేజీలలో అదనంగా 20 రిజర్వాయర్లను నిర్మించాలని వ్యాప్కో సంస్థ ద్వారా సర్వే నిర్వహించారు. అయితే ఇరిగేషన్ శాఖలో కేఎల్ఐకి సంబంధించిన అదనపు రిజర్వాయర్ల నిర్మాణంపై పరోగతి అతీగతి లేకుండాపోయింది. సర్వేకే పరిమితమైన ఇరిగేషన్ అధికారులు భూసేకరణకు సంబంధించి కనీస ప్రతిపాదనలను కూడా రెవెన్యూ శాఖకు అందజేయలేదు. దీని పర్యవసానంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కొత్త ఆయకట్టు స్థిరీకరణ జరగలేదు. రిజర్వాయర్ల నిర్మాణం జరగకపోవడంతో చెరువులు, కుంటలను నింపడం ద్వారా ఉన్న ఆయకట్టుకు నీరందించడం తప్ప అదనపు ప్రయోజనం చేకూరడం లేదు. వాస్తవానికి కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా మెట్ట భూములకు నీరందించడమే లక్ష్యం కాగా విషయాన్ని పాలక ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి.

భూసేకరణకు ఆటంకాలెన్నో..

కేఎల్ఐ పథకంలో భాగంగా అదనపు రిజర్వాయర్లు నిర్మించి మెట్ట భూములకు నీరందించాలనే లక్ష్యానికి సాక్షాత్తు ఇరిగేషన్ అధికారులే గండికొట్టారు. దీంట్లో పాలక ప్రభుత్వాల సహకారం కూడా ఉన్నది. కేఎల్ఐ పథకం కింద అదనపు రిజర్వాయర్లు నిర్మించాలనే ప్రతిపాదన తెరమీదకు వచ్చినప్పుడు తరికి 2 లక్షలు, మెట్టకు ఎకరాకు 80 వేల రూపాయల ధర పలుకుతున్నప్పుడు ప్రభుత్వం భూసేకరణ విషయంలో తీవ్రమైన జాప్యం చేసింది. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడం, వ్యవసాయం అభివృద్ధి చెందడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరాకు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల ధర పలకడంతో రెవెన్యూ అధికారులు భూసేకరణకు ఇస్తున్న ధరకు బాగా వ్యత్యాసం ఉండటంతో భూములు స్వచ్ఛందంగా ఇవ్వడానికి అన్నదాతలు ముందుకు రావడంలేదు. దీని పర్యవసానంగా కూడా కొత్త రిజర్వాయర్ల నిర్మాణ ప్రక్రియకు ఆటంకం కలుగుతోంది. 2025 నాటికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తి కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో భూసేకరణ సమస్యను ఎలా అధిగమిస్తారనే విషయంలో ఉత్కంఠ నెలకొన్నది. భూసేకరణ విషయంలో రైతులకు న్యాయం చేసి, చివరి ఆయకట్టు వరకు నీరందించగలిగితే అన్ని వర్గాల్లో సంతృప్తి నెలకొనే అవకాశాలున్నాయి.

పనిగట్టుకొని విమర్శలు చేయొద్దు


- తెలంగాణలో విద్యకు సువర్ణాధ్యాయం
- చిన్న పొరపాటు లేకుండా టీచర్ల బదిలీలు, పదోన్నతులు
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యేలు యెన్నం, జీఎంఆర్, శ్రీహరిలకు ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రం అందిస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 21: 'తెలంగాణను విధ్వంసం చేసినోళ్లు, తెలంగాణ ఆకాంక్షలను దెబ్బతీసినోళ్లు ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అధికారం పోయిందని కొందరు నాయకులు రోడ్లపై తిరుగుతూ ఏడిపడితె అది మాట్లాడుతున్నారు'. అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా యెన్నం మాట్లాడుతూ కొందరు నాయకులు పనిగట్టుకుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. తెలంగాణ నిధులు దోచుకొని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన వారు ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. గత పదేళ్లలో దోచుకుని, దాచుకున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతీ నెల సమయానికి వేతనాలు ఇవ్వని పరిస్థితికి తెచ్చిందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రావడంతో విద్యకు సువర్ణ అధ్యాయం వచ్చిందన్నారు. సాంకేతికత పెరిగిందని, భవిష్యత్‌లో ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ శిక్షణ ఇప్పించి దృశ్య, శ్రవణం ద్వారా నాణ్యమైన విద్యను అందించాలనే ప్రతీ పాఠశాలలో అందించాలనే నిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో 24,600 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 68 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు కల్పించామన్నారు. బదిలీలు, పదోన్నతులు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా పారదర్శకంగా జరిగాయని గుర్తు చేశారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు జీఎంఆర్, శ్రీహరి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జోగుళాంబ గద్వాల జిల్లా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత మాట్లాడారు. సమావేశంలో డీఈవో రవీందర్, సీఎంవో బైకాని బాలుయాదవ్, ఎఎంవో దుంకుడు శ్రీనివాస్, తెలంగాణ పీఆర్‌టీయూ వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ, వర్కింగ్ ప్రసిడెంట్ చంద్రశేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు వై.శ్యాంబాబు , ప్రధాన కార్యదర్శి రమాకాంత్, గౌరవ అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చిన్న యుగేందర్‌రెడ్డి, భూపతిసింగ్, శ్రీధర్, జైపాల్‌రెడ్డి, రాఘవేందర్, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జూరాలకు సందర్శకుల తాకిడి



జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు



ప్రాజెక్టుపై సందర్శకుల కిటకిట



సందర్శకుల రాకతో నిలిచిన ట్రాఫిక్

ధరూరు/అమరచింత, జూలై 21: జోగుళాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు 27 గేట్లను ఎత్తడంతో ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు కుటుంబ సభ్యులతో తరలొచ్చారు. పిల్లలు, పెద్దలు, యువకులు గేట్ల ద్వారా శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఫొటోలు దిగారు. ప్రాజెక్టు ప్రధాన రహదారిపై నుంచి సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. మరికొందరు అత్యుత్సాహంతో నీటి ప్రవాహం సమీపంలోకి వెళ్లి ప్రమాదకరంగా సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ప్రాజెక్టును చూశాక పక్కనే పాకల్లో విక్రయించే చేపల వంటలను తినేందుకు ఆసక్తి చూపారు. పర్యాటకుల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు గద్వాల వైపు నుంచి, ఇటు ఆత్మకూరు, అమరచింత వైపు నుంచి వెళ్లిన వాహనాలు గంటల తరబడి ప్రాజెక్టు ప్రధాన రహదారిపై కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్ ప్రాజెక్టు వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను అదుపు చేశారు. ప్రాజెక్టు సందర్శకులు భారీగా తరలిరాడంతో వారిని కట్టడి చేసేందుకు అధికారులు పర్యవేక్షించారు.

ఐదు రోజుల్లో జలాధివాసం

- వరద నీటిలో మునిగిపోనున్న సంగమేశ్వరాలయం



సోమశిల సంగమేశ్వరాలయం



ఆలయం సమీపానికి చేరిన వరద నీరు

కొల్లాపూర్, జూలై 21: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జురాల ద్వారా శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. దాంతో తెలుగు రాష్ట్రాల ప్రజల ఆరాధ్యదైవంగా పూజించే సంగమేశ్వర ఆలయం జలాధివాసం కానుంది. 20 అడుగుల మేర వరద వస్తే.. ఆలయం నీటిలో మునిగిపోనుంది. సోమవారం సాయంత్రం జలాలు ఆలయంలోకి చేరుకుంటాయని, మరో వారంలో ఆలయం పూర్తిగా నీటిలో మునిగిపోవచ్చని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్యశర్మ తెలిపారు. దాంతో దేవాలయం వద్ద గడిచిన వేసవిలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు పూర్తిగా తొలగించారు. ఎగువ ఆలయం నుంచి అమర్చిన విద్యుత్ సరఫరాను, ఆలయ పరిసరాల్లోని స్టీల్ క్యూ పైపులైన్లు తొలగించారు. వాటన్నింటినీ సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు రఘురామయ్యశర్మ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి



ద్వారకా సాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

గురుపౌర్ణమి వేడుకలను మహబూబ్‌నగర్ పట్టణంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయి మందిరాలకు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. వేడుకలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



పాలకొండ సాయి మందిరంలో పూజలు చేస్తున్న అర్చకుడు



చిన్నారులతో కలిసి పాలకొండ సాయి మందిరానికి వస్తున్న మహిళ





పాలకొండ సాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు, దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

సందర్శకులు సంయమనం పాటించాలి

- డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు వెల్లడి
- నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమరచింత, జూలై 21: జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలను గుర్తించి సంయమనం, జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జూరాల ప్రాజెక్టును సందర్శించిన డీఎస్పీ ప్రాజెక్టు ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం, గేట్లను ఎత్తివేసి దిగువకు వదులుతున్న నీటి ప్రవాహం, కుడి ఎడమ కాలువలు పర్యాటకుల సందర్శన ప్రదేశాలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూరాల ప్రాజెక్టుకు మరింత వరద చేరే అవకాశం ఉందని, ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులు చిన్న పిల్లలను తీసుకు రాకూడదని, ఈతరాని వాళ్లు నీటికి దూరంగా నిలిచి ఉండాలని, మత్స్య కార్మికులు చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. జూరాల బ్యాక్ వాటర్, కుడి ఎడమ కాలువల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని, పర్యాటకులు ప్రమాదాలను గుర్తించి మెలగాలని ఆయన కోరారు. వర్షాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అత్యవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని కోరారు. ఆయన వెంట సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్ సిబ్బంది ఉన్నారు.


జూరాల ప్రాజెక్టును సందర్శించిన డీఎస్పీ వెంకటేశ్వరరావు

శంకర సముద్రం కుడి కాలువకు నీటి విడుదల


విడుదలైన నీటికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూలై 21 : మండలంలోని శంకర సముద్ర రిజర్వాయర్ కుడి కాలువ ఆయకట్టుకు మోటార్ల ద్వారా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదివారం సాగునీటిని విడుదల చేశారు. మోటార్ల నుంచి కాలువకు వచ్చిన నీటికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కాలువ పరిధిలోని మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందాలని అందుకోసం రైతులు నిర్వాహణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, వెంకటరమణ, కోటేశ్వర్‌రెడ్డి, యాదగిరి, పెంటన్న, బాలరాజు, నాగేశ్వర్‌రెడ్డితో పాటు నిర్వేన్, పాలెం, కనిమెట్ట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గట్టన్న (ఫైల్)

ఆత్మకూరు, జూలై 21: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆత్మకూరు మండలంలోని గుంటిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పెంకుల గట్టన్న (35)కు ఉన్న నాలుగు ఎకరాల పొలంలో రెండు బోర్లు వేసినా నీరు లభించలేదు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో బాధపడుతూ ఈ నెల 1వ తేదీన ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన భార్య జయమ్మ ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. మూడు రోజుల పాటు చికిత్స పొందిన అనంతరం కోలుకున్నాడు. వారం రోజుల క్రితం మళ్లీ అనారోగ్యంతో బాధపడుతుండటంతో వనపర్తి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నాలుగు రోజుల పాటు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు తల్లి పెంకుల బాలకిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మన్యం(ఫైల్)

వనపర్తి రూరల్, జూలై 21: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. మృతుడి భార్య సైదమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దగూడేనికి చెందిన రైతు ఉండెకోటి మన్యం (50) గ్రామ శివారులోని తన పొలం వద్ద కరిగేటకు నీళ్లు పెట్టివస్తానని వెళ్లారు. చాలా సమయమైనా మన్యం ఇంటికి రాకపోవడంతో తన భార్య సైదమ్మ ఫోన్ చేస్తే ఫోన్ కలవలేదు. కుటుంబ సభ్యులతో సహ వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా కిందపడి ఉన్నాడు. వెంటనే అతనిని జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యుదాఘాతంతో మన్యం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి మృతి దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటానని భరోసానిచ్చారు.

వర్షానికి కూలిన ఇల్లు


ఆత్మకూరు పట్టణంలో వర్షానికి కూలిన ఇల్లు

ఆత్మకూరు, జూలై 21: నాలుగు రోజులుగా ముసురు వర్షాలు కురుస్తుండడంతో ఆత్మకూరు పట్టణంలోని మూడో వార్డులో గొల్ల కృష్ణయ్య ఇళ్లు ఆదివారం కూలిపోయింది. మట్టి మిద్దె కావడంతో కూలిపోయే అవకాశం ఉందని ముందుగానే గ్రహించి వరండాలో పడుకోవడంతో ప్రమాదం తప్పిందని, కాగా నిత్యావసర సరకులు పూర్తిగా పాడైపోయినట్లు బాధితులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వార్డు కౌన్సిలర్ అశ్విని కుమార్ కోరారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కొత్తకోట, జూలై 21: విద్యుదాఘాతంతో పాడిగెదే మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోటలో ఆదివారం చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన సురేందర్‌రెడ్డి తన పాడిగెదేలను మేతకు తీసుకెళ్తుండగా మదనాపురం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమీపంలోకి ఓ గేదె వెళ్లింది. దీంతో విద్యుదాఘాంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గేదె మృతి చెందిందని సురేందర్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతి చెందిన గేదె విలువ రూ. 60 వేలు ఉంటుందని, విద్యుత్ శాఖ అధికారులు తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఎడతెరిపి లేని ముసురు

వనపర్తి అర్బన్, జూలై 21: జిల్లాలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురుస్తోంది. దీంతో జన జీవనం స్తంభించింది. ఆదివారం చిరుజల్లులతో కూడిన వర్షం పడడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. ఉదయం నుంచి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వారం రోజులుగా ముసురు వర్షం కురుస్తుండడంతో పత్తి , మిర్చి నారుమడులకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఖిల్లాఘణపురం మండలంలో అత్యధికంగా 19.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వనపర్తి 18.1, మదనాపూర్ 17.0, రేవల్లి 16.4, గోపాల్‌పేట, కొత్తకోట 15.7, పెద్దమందడి 11.5, అమరచింత 11.4, పానుగల్ 11.2, ఆత్మకూరు 9.7, పెబ్బేరు 9.4, వీపనగండ్ల 8.1, చిన్నంబావి 6.0, శ్రీరంగాపూర్ 5.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది.

నేటి నుంచి ఉన్నత పాఠశాలలు ఉదయం తొమ్మిది గంటలకే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 21 : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పు చేస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులు సోమవారం నుంచి అమలు కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు అన్నింటినీ ఒకే సమయం ఉండేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15గంటల వరకు కొనసాగుతున్నాయి. ఉన్నత పాఠశాలు ఇప్పటి వరకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు ఉండేది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు మార్పు చేశారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 21 : విద్యాశాఖలో 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రభుత్వానికి కృతజ్ఞత సభకు హాజరైన ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డిలకు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐకాస జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి ఎండి విక్రమ్, ఖాజామైనుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, సభ్యులు గంగమ్మ, అమృతవాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

మహబూబ్‌నగర్, జూలై 21 : మహబూబ్‌నగర్ పట్టణ సమీపంలోని బండ మీదిపల్లి శిశుమందిర్ పాఠశాల రోడ్‌లో ఆదివారం ఓ గుర్తు తెలియని మహిళ (54) మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. బాధితులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

బ్యాటరీ చోరీలకు పాల్పడుతున్న దొంగలకు దేహశుద్ధి

జడ్చర్ల, జూలై 21 : వాహనాలకు అమర్చిన బ్యాటరీలను చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలకు స్థానికులు దేహశుద్ధి చేసిన సంఘటన ఆదివారం పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు గౌడ ఫంక్షన్ హాల్ సమీపంలో పార్కింగ్ చేసిన వాహనానికి ఉన్న బ్యాటరీ చోరీకి పాల్పడుతుండగా పట్టుకుని దేహశుద్ధి చేసినట్లు తెలిపారు. దేహశుద్ధి చేస్తుండగా అక్కడి నుంచి వారిద్దరు పరారయ్యారని పేర్కొన్నారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

భూతగాదా

- బాబాయ్‌పై గొడ్డలితో దాడి చేసిన అబ్బాయి
- చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలింపు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 21 : బాబాయ్‌పై భూతగాదాల విషయంలో అబ్బాయి గొడ్డలితో దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కృష్ణయ్య, నాగేశ్వ ఇద్దరు అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. మరో మారు శుక్రవారం కృష్ణయ్య, నాగేశ్వ గొడవ పడుతుండగా కృష్ణయ్య కుమారుడు రాంబాబు బాబాయ్ అయిన నాగేశ్వపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనపై తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. నాగేశ్వ కుమారుడు కర్ణాకర్ ఆదివారం నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని శవం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 21 : నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని మగ మనిషి(40) శవం లభించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న సురేంద్రరావు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు ఎర్రని కలర్ షర్టు ధరించి దుప్పటి కప్పుకుని పడుకుని మృతి చెందినట్లు తెలిపారు. ఇట్టి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డ్రైనేజీలో పడి బాలిక మృతి


మంజుల

మాగనూరు, జూలై 21 : ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి ఓ బాలిక మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాగనూరుకు చెందిన చిన్ననోళ్ల బాలప్ప, దేవమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు. కాగా పెద్ద కూతురు మంజుల (15)కు అమావాస్య, పౌర్ణమి రోజుల్లో మూర్ఛ వ్యాధి వస్తుండేది. ఈ క్రమంలో ఆదివారం బయటికి వెళ్లగా మూర్ఛవ్యాధి రావడంతో డ్రైనేజీలో పడింది. ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో డ్రైనేజీలోనే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రమాదభరితంగా ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలంటూ నోటీసులు


జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారు ఆరో వార్డులో నోటీసులు అందజేస్తున్న కౌన్సిలర్ రమేశ్, వార్డు అధికారులు

జడ్చర్ల, జూలై 21 : గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న ముసురువర్షంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జడ్చర్ల మునిసిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపడ్తున్నారు. అందులో భాగంగా జడ్చర్ల మునిసిపాలిటీలోని పలు వార్డులలో కూలేందుకు సిద్ధంగా ఉండి, ప్రమాదభరితంగా ఉన్న ఇళ్లను గుర్తించిన మునిసిపాలిటీ వార్డు అధికారులు, ఇళ్లను ఖాళీ చేయాలంటూ ఆదివారం నోటీసులు జారీ చేశారు. మునిసిపాలిటీలోని ఆరో వార్డులో కౌన్సిలర్ రమేశ్ ఆధ్వర్యంలో, 14వ వార్డులో కౌన్సిలర్ పుష్పలత ఆధ్వర్యంలో వార్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. సురక్షితప్రాంతంలో నివాసం ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. వీరితో పాటు పలు వార్డులలో ఆయా వార్డు కౌన్సిలర్లు వార్డులలో పర్యటించి, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.

నాగర్‌కర్నూల్‌లో కొండచిలువ కలకలం


నాగర్‌కర్నూల్ పట్టణంలో కనిపించిన కొండచిలువ

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 21 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల రవి థియేటర్ ఎదురుగా ఉన్న పాత ఇనుపసామాన్ దుకాణంలో ఆదివారం కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పట్టణం నడిబొడ్డునకు కొండచిలువ ఎలా వచ్చిందని స్థానిక ప్రజలు ఆందోళన వెలిబుచ్చారు. కొండచిలువను స్థానికులు పట్టుకుని అడవిలో వదిలేందుకు వెళ్లారు.

పర్యావరణానికి ఎంతో మేలు

- వస్త్రం సంచుల తయారీలో మహిళా సంఘాలు
- ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అడుగులు

పాలమూరు, జూలై 21 : మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, బాదేపల్లి, భూత్పూర్ మునిసిపాలిటీలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు. మునిసిపాలిటీ సిబ్బంది నిరంతరాయంగా దుకాణాలు, హోల్‌సేల్ షాపులకు వెళ్లి సోదా చేసి, ప్లాస్టిక్ పట్టుబడితే జరిమానా విధిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధంతో వస్త్రంతో తయారు చేసి సంచులు వాడాలనే నిర్ణయానికి ప్రజలు అలవాటు పడుతున్నారు. ప్రజలు, మహిళలను ప్రోత్సహించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ముందుకు వచ్చింది. వస్త్రం సంచుల తయారీతో పర్యావరణానికి మేలు చేయాలని మహిళా సంఘాల సభ్యులు తీర్మానించుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మీటరు వస్త్రంలో రెండు, మూడు, ఐదు కిలోల బరువుతో మూడు రకాల సంచులను తయారు చేస్తున్నారు. మహబూబ్‌నగర్, బాదేపల్లి, భూత్పూర్‌లోని మహిళా సంఘాల సభ్యులు సంచులు తయారు చేసి అమ్ముకుని ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో మహబూబ్‌నగర్ -2731 మహిళా సంఘాలు, బాదేపల్లి-617, భూత్పూర్-272 ఇలా 3620 మహిళా సంఘాలు, 45 వికలాంగుల సంఘాలు (పర్సన్ విత్ డిసేబిలిటీ- పీడబ్ల్యూడీ) మొత్తం కలిపి 3665 సంఘాలు పని చేస్తున్నాయి. పలుచోట్ల వస్త్రంతో తయారు చేసిన సంచులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పిస్తామని మెప్మా భరోసానిస్తోంది. మహిళల స్ఫూర్తితో మరింత మంది ముందుకు వస్తే ఆరోగ్య సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది.


వస్త్రం సంచులను తయారు చేస్తున్న మహిళలు



వస్త్రంతో తయారు చేసిన సంచులు

సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేధం విధించాలి



అన్ని మునిసిపాలిటీల పరిధిలో సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేధం విధించాలి. దానివల్ల మహిళలు, పురుషులకు ఉపాధి అధికంగా దొరుకుతుంది. జడ్చర్ల సాయిరాం మహిళా సంఘంలో సభ్యురాలిగా మహిళా సంఘంలో సభ్యురాలిని. చాలా కాలం కిందట కుట్టు శిక్షణ తీసుకున్న. కుట్టు పనులతో ఆశించిన ఉపాధి లభించలేదు. ఇప్పుడు ప్రభుత్వమే ప్లాస్టిక్ నిషేధించటంతో వస్త్రం సంచులకు డిమాండ్ పెరిగింది.

- జె.బాలమణి, జడ్చర్ల

మహిళల అభిరుచికి నచ్చినట్లు బ్యాగులు



ప్రజలు, మహిళల అభిరుచి మేరకు వస్త్రం సంచుల తయారీ చేస్తుంటాం. సంఘం తరపున ఒక్కొక్కరికి రూ.లక్ష రుణం తీసు కున్నం. మహిళా సంఘాల నుంచి తయారు చేసిన వస్త్రం సంచులను అమ్ముకోవటానికి మార్కెట్లో స్థలం కేటాయించాలి. ప్లాస్టిక్ కవర్ల నిషేధంతో వస్త్రం సంచుల తయారీపై అందరి దృష్టి పడింది.

- బ్యాగుల సంధ్య, మహబూబ్‌నగర్

ప్లాస్టిక్ కవర్ల కంపెనీలను మూసి వేయించాలి



పర్యావరణాన్ని పాడుచేసే ప్లాస్టిక్ కవర్లు తయారు చేసే కంపెనీలనే మూసేయించాలి. అప్పుడే ప్రజలు జ్యూట్, వస్త్రం సంచులనే వాడాలనే నిర్ణయానికి వస్తారు. వరలక్ష్మి మహిళా సంఘం అడ్డాకుల సభ్యులం. ప్లాస్టిక్ కవర్ల నిషేధించిన తరువాత అందరు జూట్, బట్ట సంచులనే అడుగుతున్నారు. తయారు చేసిన వాటిని రెగ్యులర్‌గా అమ్ముతున్నం.

- మద్దూరి శ్రుతి, అడ్డాకుల

ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి

- జూరాలకు పోటెత్తిన వరద - 27 గేట్లు ఎత్తివేత


జూరాల ప్రాజెక్టు 27 గేట్ల ద్వారా దిగువకు శ్రీశైలంవైపు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

ధరూరు, జూలై 21 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగింది. దాంతో జెన్‌కోలో ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. జూరాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జూరాల అధికారులు ఆదివారం మధ్యాహ్నం 27 గేట్లను ఒక మీటరు మేర ఎత్తారు. ప్రస్తుతం 317.040 మీటర్లలో నీటి నిల్వ ఉండగా, ప్రాజెక్టులో 6.805 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1,29,000 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదుకాగా, 27 గేట్లను ఒక మీటరు మేర ఎత్తివేసి 1,03,842 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. దీంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 30,407 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఆరు యూనిట్ల ద్వారా 153 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 1300, ఎడమకాల్వకు 870, కుడి కాలువకు 596, సమాంతర కాలువకు 300, భీమా లిఫ్ట్-2కు 750, ఆవిరి రూపంలో 42 క్యూసెక్కుల నీరు మొత్తం ప్రాజెక్టు నుంచి 1,34,249 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

స్టేడియంలో నిఘా కరువు

- విలువైన క్రీడా సామగ్రికి రక్షణ ఏదీ ?


మహబూబ్‌నగర్‌లోని ఇన్‌డోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 21 : స్టేడియం మైదానంలో సీసీ కెమెరా నిఘా కరువైంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇండోర్ స్టేడియం నిర్మించారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఆర్చరీ తదితర క్రీడలకు సంబంధించి కోర్టులు ఏర్పాటు చేశారు. నిత్యం వందలాది మంది ఉదయం వాకర్స్, క్రీడాకారులు ఆటలు ఆడుకునేందుకు వస్తుంటారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన క్రీడా ప్రాంగణంలో నిఘా అత్యావసరం. పక్కనే కళాశాలలు, హాస్టళ్లు ఉండడంతో యువతీ, యువకులు నిత్యం మైదానం పని వేళలు లేనప్పుడు లోపలికి వస్తున్నారు. విలువైన క్రీడా సామగ్రికి రక్షణ కరువైంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నిత్యం క్రీడాకారులు, వాకర్స్ తదితరుల రాకపోకలపై దృష్టి పెట్టేందుకు వీలుంటుంది.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

స్టేడియం మైదానంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రతిపాదనలు పంపించామని డీవైఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. అనుమతి రాగానే మైదానం మొత్తం కవరయ్యేలా బిగిస్తామని తెలిపారు. ఉదయం, సాయంత్రం మాత్రమే ఆటలు ఆడుకునేందుకు, వాకింగ్‌కు అనుమతిస్తామని, ఇతర వేళల్లో ఎవరినీ అనుమతించలేదని ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

నవాబ్‌పేట, జూలై 21 : మండలంలోని ఇప్పటూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సమావేశమై నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 1994-95 బ్యాచ్‌కు చెందిన వీరు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమై చదువులు చెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. వారు తీసుకున్న నిర్ణయాలే ఏడు తమకు పూల బాటలుగా మారాయన్నారు. జీవితంలో బాల్యం మరిచిపోలేని అనుభూతి అన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, అబ్దుల్లా, ఇప్ప నారాయణ, శ్రీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాలస్వామి, బాలరాజు, శ్రీహరి, మల్లేష్, ఆనంద్, సత్యం, పుష్ప, మాధవి, వనజ, మల్లేశ్వరి, గౌసియా, అనిత పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీ హోమాలు


చండీహోమంలో పాల్గొంటున్న భక్తులు

అలంపూరు జూలై 21 : దక్షిణ కాశీగా పేరుగాంచిన అలంపూరు పుణ్య క్షేత్రం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాల్లో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ప్రతీ అమావాస్య, పౌర్ణమి, శుక్రవారం అమ్మవారి ఆలయంలో చండీహోమాలు నిర్వహిస్తారు. భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకా సుదూర ప్రాంతాల నుంచి వచ్చారు. ముందుగా తుంగ భద్రానదిలో స్నానమాచరించి స్వామి వారి ఆలయంలో గణపతి పూజలు, అభిషేకాలు, రేణుక ఎల్లమ్మ ఆలయంలో సంతాన లక్ష్మీపూజలు చేసి, అమ్మవారి ఆలయంలోని యాగశాలలో చండీ హోమంలో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమ అర్చనలు, వడిబియ్యం, చీరలు, త్రిశతి అర్చనలు, ఖడ్గమాలలు సమర్పించారు. భక్తులకు దేవస్థానంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు. అన్నదానం వసతి కల్పించినట్లు ఈవో పురేందర్ కుమార్ తెలిపారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రముఖుల పూజలు

జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దివ్యాంగుల సంక్షేమశాఖ కమిషనర్ బి శైలజ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా వీరికి ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో అర్చన వంటి విశేష పూజలను చేయించారు. శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు.

ఆర్యవైశ్య యువతకు సులభం

- ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్



యువతీ, యువకులను అభినందిస్తున్న ఆవోపా నాయకులు

భూత్పూర్, జూలై 21 : ఆర్యవైశ్య వివాహ వేదిక ద్వారా యువతి, యువకులకు వివాహాలు అయ్యేందుకు సులభం అవుతుందని ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ అన్నారు. ఆదివారం మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ గ్రామ శివారులో ఉన్న వాసవి గార్డెన్‌లో ఆర్యవైశ్య నాయకుడు కంది శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి మలిపెద్ది శంకర్‌తో పాటు ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక చైర్మన్ కొండూరు రాజయ్య, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ వేదిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక ద్వారా ఆర్యవైశ్య యువతి, యువకులకు చాలా సులభంగా వివాహాలు అయ్యే అవకాశాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమానికి 203 మంది యువతులు, 250 మంది యువకులు హాజరయ్యారు. అనంతరం వివాహాలకు సంబంధించి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆవోపా నాయకులు తులసీ సుధాకర్, కేసీ చంద్రమోహన్, కల్వ యాదగిరి, మిర్యాల వేణుగోపాల్, గుమ్మడవెల్లి భాస్కర్, ఆవోపా అధ్యక్షుడు కె. ప్రకాశ్, వివిధ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, ఉమ్మడి జిల్లాలోని అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోతేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌కు వీడని గ్రహణం

- ఏళ్లకాలంగా పెండింగ్‌లో పనులు - ఇబ్బందులు పడుతున్న రైతులు


అసంపూర్తి నిర్మాణంతో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

వెల్దండ, జూలై 21 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని పోతేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు గ్రహణం వీడడంలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణపనులు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో సమీప గ్రామాల ప్రజలు, రైతులు లో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే ఉద్దేశంతో పోతేపల్లి గ్రామంలో 2018లో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరయ్యింది. దీనికిగాను రూ. 1.50కోట్లు మంజూరు కాగా పనులు చేపట్టారు. ఇక తమ విద్యుత్ సమస్యలు తీరుతాయని భావించిన స్థానికులకు నిరాశే ఎదురైంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కాగా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవచూపినా సమస్య ఓ కొలిక్కిరాలేదు. దీంతో మరో వ్యక్తికి పనులు అప్పగించినా ఫలితం లేక పనులు ముందుకు సాగలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులు సైతం చొరవ చూపలేదని విమర్శలు ఉన్నాయి. దీంతో సబ్‌స్టేషన్ మంజూరై ఐదేళ్లు కావస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో పోతేపల్లితో పాటు చుట్టుప్రక్కల గ్రామాలైన లింగారెడ్డిపల్లి, దొడ్లపల్లి, బుడ్డోనిపల్లి, ఎంజీ తండా, అల్లంతోటబావితండా, పోచమ్మతండాలకు చెందిన రైతులు విద్యుత్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా కేఎల్ఐ కాలువ సైతం ఈ ప్రాంతం నుంచి వెళ్తుండటంతో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రధానంగా రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తక్షణమే సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తిచేసేందుకు కృషిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

లో వోల్టేజీ సమస్య ఉంది



అసంపూర్తిగా ఉన్న నిర్మాణపనులు తక్షణమే పూర్తిచేయాలి. లోవోల్టేజీతో సమస్యలు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులు పూర్తయ్యేలా చొరవతీసుకోవాలి. కొన్నిసందర్భాలలో లో వోల్టేజీతో పంటలు సైతం ఎండిపోయే ప్రమాదం ఉంది. అధికంగా గిరిజన తండాలకు లబ్ధిచేకూర్చే సబ్‌స్టేషన్ పనులు పునరుద్ధరించాలి.

- కొండల్‌యాదవ్, పోతేపల్లి

గమ్యం చేరాలంటే నరకమే

- ● గుంతలమయంగా ప్రధాన రాహదారి
- ● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- ● నాలుగు లైన్ల రహదారిగా నిర్మించాలని కోరుతున్న చారకొండ ప్రజలు

చారకొండ, జూలై 21: గుంతల మయంగా మారి రాళ్లు తేలిన రహదారిపై గమ్యానికి చేరుకోవాలంటే వాహనదారులు నరకయాతన పడాల్సి వస్తుంది. గుంతలమయంగా మారిన రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చారకొండ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో భాగంగా చారకొండ మండల కేంద్రం నుంచి మండలంలోని మర్రిపల్లి వరకు 2 కిలో మీటర్ల మేర బైపాస్‌రోడ్డు పనులను నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి కాంట్రాక్టర్లు బైపాస్ రోడ్డు పనులను నత్తనడకన చేస్తున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల ప్రధాన రాహదారి అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగుకో గుంత ఉండడంతో ముసురుకు వర్షం నీటితో నిండిపోయాయి. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు గమ్యం చేరాలంటే జంకుతున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి తీవ్ర గాయాలైన సంఘటనలు చాలానే ఉన్నాయి.

మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఇళ్లు ఉన్నవారు, దుకాణం దారులు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో దుమ్ముతో రోగాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు గుంతల మయంగా ఉన్న రోడ్డుపై తాత్కాలికంగా మట్టిని పోసి చేతులు దులుపుకున్నారు. ముసురు వర్షాలకు భారీ వాహనాల రాకపోకలకు గుంతల మయంగా మారింది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రం నుంచి మండలంలోని మర్రిపల్లి వరకు గుంతల మయంగా మారిన ప్రధాన రాహదారికి మరమ్మతులు చేపట్టి నాలుగులైన్ల రోడ్డు, సెంటర్‌లైట్ ఏర్పాటుతో పాటు, శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జిని నిర్మించాలని చారకొండ ప్రజలు కోరుతున్నారు.



చిత్తడిగా మారిన ప్రధాన రహదారి

నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించాలి

మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు బైపాస్‌రోడ్డు పోవడంతో ప్రస్తుతం ఉన్న రోడ్డును ఎవరు పట్టించుకోవడం లేదు. రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది, గుంతల్లో వాహనదారులు కిందపడి ఆసుపత్రుల పాలైన సంఘటనలు చాలనే ఉన్నాయి. చిన్న పాటి ముసురు వర్షానికే గుంతల్లో నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు నీళ్ల షాపుల్లోకి ఎగిరి పడుతున్నాయి. ప్రజాప్రతినిధులు ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నాలుగులైన్ల రోడ్డుతో పాటు నూతన బ్రిడ్జిని నిర్మించాలి.

- కర్నాటి రాజు, చారకొండ



గుంతలమయంగా మారిన వివేకానంద చౌరస్తా

తెలకపల్లి, జూలై 21 : మండల కేంద్రంలోని ప్రధాన కూడలియైన వివేకానంద చౌరస్తా గుంతలమయంగా మారిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పాదచారులు నడవడానికి కూడా ఇబ్బందిగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులుగానీ, స్థానిక గ్రామపంచాయతీ అధికారులుగానీ పట్టించుకోకపోవడం వలన ఇబ్బందులు తప్పడం లేదు. వివేకానంద చౌరస్తాలో గుంతలు వెంటనే పూర్తి చేయాలని రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వివేకానంద చౌరస్తాలో నీటి గుంతలు

నల్లమలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం

- అక్కమహాదేవి గుహలను సందర్శించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

దోమలపెంట, జూలై 21: నల్లమల ప్రాంతంలో ఉన్న సుందరమైనా ప్రాంతాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం దోమలపెంటకు పది కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఒడ్డున ఉన్న అక్కమహాదేవి గుహలను సందర్శించారు. అక్కడ అక్కమహాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో ఉన్న మల్లెలతీర్థం, సలేశ్వరం, మద్దిమడుగు, అక్కమహాదేవి గుహలు తదితర ప్రాంతాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఈగలపెంట ఇంక్లాండ్ టన్నెల దగ్గర నుంచి అక్కమహాదేవి గుహల సందర్శనకు బోట్లను ఏర్పాటు చేసి నిత్యం కృష్ణానది అందాలను సందర్శించేందుకు పత్యేక ప్రణాళిక రూపొందించి అటు ప్రభుత్వానికి ఇటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ డీఆర్‌వో రవికుమార్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్, నాయకులు మోయజోద్దీన్, హరినారాఇగౌడ్, మల్లేష్ తదితరులున్నారు.



అటవీశాఖ అధికారులతో అక్కమహాదేవి గుహలను సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

దోమలపెంట, ఈగలపెంటల గ్రామాల పేరు మారుస్తాం

దోమలపెంట: శ్రీశైలం భమరాంభ మల్లికార్జున స్వామి సమీప గ్రామాలైన దోమలపెంట, ఈగలపెంట గ్రామాల పేర్లను త్వరలోనే మారుస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి వటువర్లపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ దోమలపెంటను బ్రహ్మగిరి, ఈగలపెంటలను కృష్ణగిరిగా పేర్లు మార్చేందుకు అధికారులతో చర్చించిన తరువాత పూర్తిస్థాయిలో గ్రామాల పేరు మారుస్తామన్నారు. అంతే కాకుండా వటువర్లపల్లి నుంచి మల్లెల తీర్థం వరకు బీటీ రోడ్డు నిర్మాణం, వటువర్లపల్లిలో సోలారు ప్లాంటు ఏర్పాటు, కారుగుల చెరువు మరమ్మతులు చేపడుతామని గ్రామాల్లో పభుత్వ పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు ఎమ్మెల్యే హామీచ్చారు.

మాజీ సర్పంచ్ చత్రునాయక్, గ్రామ కమిటీ అధ్యక్షులు కర్నాటి శ్రీనువాస్, సాదిక్, మాజీ వార్డు సభ్యులు శ్రీను, భరత్, సాలమ్మ నాయకులు జూల్యానాయక్, సర్యానాయక్ పత్యానాయక్, ప్రభాకర్, కాశయ్య, జహంగీర్, నిరంజన్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

కల్వకుర్తి, జూలై 21: గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కల్వకుర్తి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో గురువులను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రిటైర్డు అయిన లెక్చరర్లు, ఉపాధ్యాయులను బీజేపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులు గురువులేనని వారి బాటలో ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని కోరారు.

● దేవాలయాల్లో..

కల్వకుర్తి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, సాయిబాబా దేవాలయాల్లో గురుపౌర్ణమిని పురస్కరించుకుని పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు. అయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు నరసింహ, బాబీదేవ్, చందు ఉన్నారు.

● మన్ననూర్: వ్యాసమహర్షి జన్మదినాన్ని పురస్కరించుకొని అమ్రాబాద్ మండలం మన్ననూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. మహాభారత గ్రంధాన్ని రచింపజేసిన వ్యాసమహర్షి మహా భారతానికి మూలపురుషుడని శబరిమల అయ్యప్ప సేవా సమితి గురు స్వామి సంభు వెంకట్‌రమణ అన్నారు. ఈ సందర్భంగా పలువురు గురువుల ప్రత్యేకతలను కొనియయాడారు. భక్తులకు పండ్లను పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు నర్సింహచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు సంభు శోభ, పులిజాల శేఖర్, జయమ్మ, ప్రభావతమ్మ, పద్మజ, హన్మంత్‌రెడ్డి , నారాయణరెడ్డి పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు భక్తులు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని ఉదయం ఓంకారం, సుప్రభాతసేవ, కాగడ హారతి, సగర సంకీర్తన, గణపతిపూజ, షిరిడిసాయి, సత్యసాయిబాబాలకు క్షీరాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి, మంత్రపుష్పం, శేజహారతి తదితర పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ తెలిపారు. దూరెడ్డి స్వాతి, ఆముదాల గీత,యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



గురువులను పూజిస్తున్న బీజేపీ నాయకులు



మన్ననూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి వ్రతాలు

నరసింహుడికి ప్రత్యేక పూజలు

తిమ్మాజిపేట: తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామ శివారులో నరసన్నగుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి తరలి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు వేద పండితులు గంగాధరశర్మ శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పార్చన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



నర్సంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఊర్కొండ, జూలై 21: తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రాజుగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పాయిళ్ల గోపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని నర్సంపల్లి గ్రామంలో రైతులకు రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలిపారు. ఆరుగాలం కష్టపడి అన్నం పెట్టే రైతుకు ఏమి చేసినా తక్కువేనని, కాంగ్రెస్ పార్టీ గుర్తించిందని అన్నారు. రైతులకు రుణ విముక్తి చేయాలని సంకల్పం ముఖ్యమంత్రికి రావడం చాలా సంతోషమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, లక్ష్మణ్, రాంరెడ్డి, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పదర మండల అధ్యక్షుడి రాజీనామా

అమ్రాబాద్, జూలై 21: కాంగ్రెస్ పార్టీ పదర మండల అధ్యక్షుడు ఎ.రామలింగయ్య యాదవ్ పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవికి రాజీనామా ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే సాధారణ సభ్యునిగా కొనసాగుతానని ఆయన ప్రకటనలో తెలిపారు.

నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

కందనూలు, జూలై 21 : నాగర్‌కర్నూల్ జిల్లా ప్రాజెక్టుల మీద హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే తన నివాసంలో జిల్లా స్థాయి అధికారులతో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ఐ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు సంబంధించి రిజర్వాయర్ల స్థితిగతులు, కాల్వల మరమ్మతుల గురించి ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను సంబంధిత గుత్తేదారులతో మాట్లాడి తొందరగా పూర్తి చేసి సాధ్యమైనంత ఎక్కువ ఆయకట్టు రైతులకు సాగునీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖ జిల్లా చీఫ్ ఇంజనీర్, ఎస్ఐలు, ఈఈలు పాల్గొన్నారు.

'అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

పెంట్లవెల్లి, జూలై 21 : పెంట్లవెల్లిలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంట్లవెల్లిలో ఉన్న ప్రభుత్వ భూమిని ఇల్లులేని పేదలను గుర్తించి వారికి పంపిణీ చేయాలని కోరారు. గతంలో పేదల ఇళ్ల స్థలాల కోసమని సర్వే చేయించి ఇప్పటి వరకు పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపించి పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేయాలన్నారు. సీపీఎం నాయకులు శ్రీనివాసులు, తిమ్మస్వామి, రాజు, గోవిందమ్మ, వెంకటస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వెల్దండ, జూలై 21 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006 - 07లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఆకృతిగార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసాచారి, రమేష్, వెంకటయ్య, భాస్కర్‌రావులకు విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం తమ ఉన్నతికి తోడ్పడిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో బాబా, ఆరిఫ్, ఆయూబ్, రమేష్, దేవేందర్, మల్లేష్, బాలరాజు, అంబేడ్కర్, శివ ఉన్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన కొల్లాపూర్ విద్యార్థులు



తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కావురి శ్రీహరి నుంచి బహుమతులు అందుకున్న కొల్లాపూర్ విద్యార్థులు

కొల్లాపూర్, జూలై 21 : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కొల్లాపూర్ విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 19, 20, 21తేదీల్లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో కొల్లాపూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు తైక్వాండో కోచ్, మాస్టర్ శరబంద రాజ్ పేర్కొన్నారు. కొల్లాపూర్ నుంచి గౌతంసాయి, అజిత్, యశ్వంత్, తేజనీష్‌లు పాల్గొన్నారని, అండర్-18 కేజీ విభాగంలో తేజనీష్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు మాస్టర్, కోచ్ శరబందరాజ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కావురి శ్రీహరి చేతుల మీదుగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ మనోహర్‌ప్రసాద్, జనరల్ సెక్రటరీ శేఖర్, ఉపాధ్యక్షుడు చరమోని భాస్కర్‌యాయదవ్, కోశాధికారి అశోక్, కోచ్‌లు ఉపేందర్, రవీందర్, భాస్కర్‌లు పాల్గొన్నట్లు మాస్టర్ శరబంద రాజ్ పేర్కొన్నారు.

యాగాల మహాపూర్ణాహుతిలో పాల్గొన్న నాగం శశిధర్‌రెడ్డి



మహాపూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న నాగం శశిధర్‌రెడ్డి

కందనూలు, జూలై 21 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ దివ్య మంగళా శాసనములతో నిర్వహిస్తున్న యాగాల మహాపూర్ణాహుతి కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. స్వరూపానంద స్వామీజీ యువ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఎన్ని గుడిలు, గోపురాలు కట్టిన వర్షాలు పడవకు కాని ఇలాంటి యాగాల వలన మాత్రమే వర్షాలు వస్తాయని స్వామీజీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అర్థం రవి, తిరుపతిరెడ్డి, బాలగౌడ్, ఐతోల్ లక్ష్మయ్య రాజావర్ధన్‌రెడ్డి, యుగందర్‌రెడ్డి, భీమయ్య, దామోదర్ రెడ్డి, భీముడు, సత్యం, విష్ణుచారి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఐక్యత ఫౌండేషన్ చైర్మెన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, జూలై 21 : ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటివైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. శంకర నేత్రాలయ సహకారంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా కంటి వైద్యశిబిరం ఆదివారం మూడోరోజుకు చేరింది. ఈ సందర్భంగా చికిత్స చేయించుకొని అవసరమున్న వారికి రాఘవేందర్‌రెడ్డి ఉచితంగా కంటిఅద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద ప్రజలకు వైద్యశిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈనెల 27 వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కంటిశుక్లాల ఆపరేషన్లు ఆర్థిక ఇబ్బందులతో చేయించుకోలేని వారికి ఇది ఒక వరంటాంటిదని పేర్కొన్నారు. సమాజసేవకు ప్రతీ ఒక్కరు ముందుకురావాలని రాఘవేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రమేష్‌నాయక్, అనిల్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, పంతుల, కొండల్, శ్రీకాంత్‌రెడ్డి, యూసుఫ్ బాబా, శివ, శ్రీపతి, శ్రీనునాయక్, అభినవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

కందనూలు, జూలై 21 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లయ్యగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహావిష్కరణ మహోత్సవానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు మహేష్‌కుమార్‌గౌడ్, కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డితోపాటు ఎంపీ మధుయాష్కీగౌడ్, స్వామిగౌడ్ తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 11గంటలకు విగ్రహావిష్కరణ అనంతరం సాయిగార్డెన్‌లో సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గౌడ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్లయ్యగౌడ్ తెలిపారు.

● బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహా ఆవిష్కరణకు సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు హాజరు కానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిద్దె రాములు ఆదివారం తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణకు మండలంలోని బీసీలు, గౌడ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మైసమ్మను దర్శించుకున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, జూలై 21: మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవత దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఈ వారం భక్తుల రద్దీ తగ్గింది.

గత మూడు నాలుగు రోజుల నుంచి ముసురు వర్షాలు కురుస్తున్నందున మైసమ్మ దేవతను దర్శనం చేసుకోవడానికి వీలుపడక భక్తులు రావడం లేదు. ఈ ఆదివారం మైసమ్మ దేవతకు టికెట్ల ద్వారా 16వేలు, హుండీ ద్వారా 32వేల ఆదాయం మొత్తం 48వేల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ సిబ్బంది మారుతీరావు తెలిపారు.

రుణమాఫీపై ఆందోళన చెందొద్దు

అచ్చంపేటటౌన్, జూలై 21: రైతులకు రూ.లక్ష రుణమాఫీపై రైతులు ఆందోళన చెందొద్దు.. ప్రతీ ఒక్కరికి అందుతుందని వ్యవసాయ అధికారి కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారికి, ఆధార్ కార్డులో, బ్యాంకులో రైతు యొక్క పేరు వేరు వేరుగా ఉన్న వారికి, మరికొందరికి రేషన్ కార్డు లేనివారికి ఇలా సాంకేతిక సమస్యలు ఉన్న వారికి రైతు రుణ మాఫీ కాలేదని, అలాంటి వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో, సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

తెలకపల్లి, జూలై 21 : మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు యజ్ఞయాగాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం కూడా నిర్వహించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ, జూలై 21: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండలంలోని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కేసీ ప్రమీల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులకు ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు ఫిర్యాదులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

జానపద కళాకారుల గ్రామ కమిటీ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి, జూలై 21 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో జానపద కళాకారుల నూతన కమిటీని ఆ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి తుపాకుల వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం యాదగిరిల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జానపద కళాకారుల సంఘం గ్రామ అధ్యక్షుడిగా ఈశ్వరయ్య.. ప్రధాన కార్యదర్శిగా గడ్డిగోపుల నారాయణ, ఉపాధ్యక్షుడిగా బొల్లె వెంకటస్వామి, కోశాధికారిగా కేశంపేట వెంకటయ్య, సంయుక్త కార్యదర్శులు బొల్లె బుడ్డయ్య, బొల్లె మైబూస్, సహాయ కార్యదర్శులు బొల్లె నాగయ్య, బిజినేపల్లి రాజు, ప్రచార కార్యదర్శులు బిజినపల్లి జీవరత్నం, ఎల్లస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శులు బత్తుల వెంకటిరెడ్డి, కే.దానయ్య, మిద్దె భాస్కర్, బంకల నిరంజన్, సొప్పరి బాలస్వామి, బొల్లె నరసింహ, మిద్దె రాములమ్మ, బంకల పీరమ్మ, బిజినేపల్లి వెంకటస్వామి, మిద్దె నిరంజనమ్మను కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు.

అర్హత ఉన్నవారికి రుణమాఫీ చేయాలి

వెల్దండ, జూలై 21: అర్హత కలిగిని ప్రతీ రైతుకు ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగిలి యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండురోజుల క్రితం విడుదల చేసిన జాబితాలో లక్షలోపు రుణం ఉన్న రైతులకు బ్యాంకుల్లో జమకాలేదని విమర్శించారు. ప్రభుత్వం పథకం అమలుపై ప్రచారంలో పెట్టిన శ్రద్ధ అమలులో పెట్టడంలేదని మండిపడ్డారు. ఇప్పటికే రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి రుణమాఫీ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శేఖర్, పోలే అశోక్, ఏకులశ్రీను, గణేష్, రవి, శ్రీను, మహేష్, అమ్రునాయక్‌లు ఉన్నారు.

కేఎల్ఐ ద్వారా సాగునీటిని విడుదల చేయాలి

వెల్దండ, జూలై 21 : కేఎల్ఐ కాలువద్వారా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో భారీగా నీరు ప్రాజెక్టుల్లోకి చేరుతుండడంతో కేఎల్ఐ కాలువకు నీరు వదలాలని కోరారు. వేలాది ఎకరాలకు నీరు అందించే కేఎల్ఐతో మాడ్గుల మండలం నాగిళ్ల వరకు చివరి ఆయకట్టుకు సాగునీరు వదలాలని అన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సాగు ప్రారంభమయ్యిందని, నారుమళ్లు సిద్ధం చేసుకుని ఉంచారని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని అసంపూర్తిగా ఉన్న పనులను తక్షణమే పూర్తిచేయాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రైతులకు అందాల్సిన పరిహారాన్ని అందించాలని రాంరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ కడారి కృష్ణయ్య, నాయకులు చల్ల మధుసూదన్‌రెడ్డి, జోగు రవికుమార్ తదితరులు ఉన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఊర్కొండ, జూలై 21: రైతులు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శోభారాణి అన్నారు. నూతనంగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఆగస్టు 5లోగా తమ ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డుల ప్రతులు, రైతుబీమా దరఖాస్తు ఫామ్ నింపి వ్యవసాయ విస్తరణ అధికారులు అందించాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు.

● తిమ్మాజిపేట : 2024కు సంబంధించి రైతు బీమా ప్రక్రియ ప్రారంభమైందని కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఆదివారం మాట్లాడుతూ గత సీజన్‌లో బీమా చేసుకోని రైతులు ప్రస్తుతం రైతుబీమాకు దరఖాస్తు ఇవ్వాలన్నారు. గతంలో రైతుబీమా చేసుకున్న రైతులు నామినిలో ఏమైనా మార్పులు చేసుకోవచ్చన్నారు. రైతులు తమ పట్టాదార్ పాసు బుక్కు, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డుల జిరాక్స్‌లను దరఖాస్తు ఫారానికి జత చేసి రైతులు స్వయంగా వ్యవసాయ కార్యాలయానికి లేదా రైతు వేదికల దగ్గరకు వచ్చి అందజేయాలన్నారు.

● వంగూరు: రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో తనూజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు ఇందుకు అర్హులని ఆగస్టు 4లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డీఎంగా యాదయ్య

కందనూలు, జూలై 21 : నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డీఎంగా యాదయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆర్టీసీ నాగర్‌కర్నూల్ జిల్లా డిపోగా పని చేస్తున్న దేవరాజు మెట్టుపల్లి డిపోకు బదిలీపై వెళ్లారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వంగూరు, జూలై 21: స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వంగూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, తదితర శాఖల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ వారు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం నెలకు రూ.28 వేలు ఇవ్వాలన్నారు.